క్లుప్తంగా

గూడ్స్‌షెడ్ అభివృద్ధికి రూ.9కోట్ల నిధులు



ప్రారంభిస్తున్న కేశోరాం ప్లాంట్ హెడ్ శ్రీనివాసరెడ్డి, రైల్వే అధికారి మోహనకృష్ణ

పాలకుర్తి: రాఘవపురం రైల్వేస్టేషన్‌లో గూడ్స్ షెడ్‌లో రూ.9కోట్ల నిధులతో అభివృద్ధి పనులు చేపట్టినట్లు రామగుండం ఏరియా రైల్వే అధికారి మోహన్‌కృష్ణ అన్నారు. మంగళవారం మండల పరిధిలోని రాఘవపురం రైల్వేస్టేషన్‌లో రైల్వేగూడ్స్ షెడ్‌ను పీఎం మోదీ వర్చువల్ పద్ధతిలో ప్రారంభించారు. కార్యక్రమంలో కేశోరాం సిమెంట్ ప్లాంట్‌హెడ్ శ్రీనివాస్‌రెడ్డితో కలిసి మోహనకృష్ణ గూడ్స్‌షెడ్డును అధికారికంగా ప్రారంభించారు. కన్నాల ఎంపీటీసీ అతిఫ్, డీసీసీ జాయింట్ సెక్రటరీ గౌసియాబేగం ఆధ్వర్యంలో మోహనకృష్ణకు పలు సమస్యలపై వినతిపత్రం అందజేశారు. గూడ్స్ సూపర్‌వైజర్ ప్రసాద్, కేశోరాం అధికారులు హనుమంతరావు పాల్గొన్నారు.

స్వచ్ఛతపై అవగాహన కల్పించాలి

సుల్తానాబాద్‌రూరల్: గ్రామంలోని ప్రజలకు స్వచ్ఛతపై అవగాహన కల్పించాలని ఎంపీడీవో దివ్యదర్శన్ అన్నారు. సుల్తానాబాద్ మండలం గర్రెపల్లి గ్రామంలో అల్ఫోర్స్ మహిళా డిగ్రీ, పీజీ కళాశాల జాతీయ సేవా పథకం కింద వారంరోజుల శీతాకాల శిబిరాన్ని మంగళవారం ప్రారంభించారు. ఎంపీటీసీ పులి అనూష, కళాశాల కరస్పాండెంట్ రవీందర్ రెడ్డి, ప్రిన్సిపాల్ శ్రీనివాస్, కార్యదర్శి ప్రశాంత్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారులు రజిత, ఐలయ్య, వైస్ ప్రిన్సిపాల్ శంకరయ్య పాల్గొన్నారు.

ఈశ్వరకృప వృద్ధాశ్రమం సందర్శన

ఫెర్టిలైజర్‌సిటీ: రామగుండం కార్పొరేషన్ 14వ డివిజన్ వీర్లపల్లి గ్రామంలోని ఈశ్వరకృప వృద్ధాశ్రమాన్ని మంగళవారం గోదావరిఖని టూటౌన్ సీఐ బి.రవీందర్ సందర్శించారు. ఆశ్రమ నిర్వాహకులు పిటి స్వామి, బోర్డ్ ఆఫ్ డైరెక్టర్లు సీఐని సన్మానించారు. ఆశ్రమానికి 25 కిలోల బియ్యాన్ని అందించారు.

అలరించిన వీడ్కోలు సమావేశం

జూలపల్లి: మండల కేంద్రంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో మంగళవారం నిర్వహించిన పదో తరగతి విద్యార్థులకు వీడ్కోలు సమావేశం అలరించింది. అనంతరం విద్యార్థుల నృత్యాలు ఆకట్టుకున్నాయి.


గ్రామాల అభివృద్ధికి కృషి



పనులను ప్రారంభిస్తున్న ఎంపీపీ దేవక్క

రామగిరి: గ్రామాల అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం ప్రత్యేక కృషి చేస్తుందని ఎంపీపీ ఆరెల్లి దేవక్క తెలిపారు. మండలంలోని బుధవారంపేట గ్రామంలో సీసీరోడ్ల నిర్మాణానికి మాజీ సర్పంచ్ దేవునూరి రజితతో కలిసి భూమిపూజ నిర్వహించారు. గ్రామాల అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తుందని, అభివృద్ధి సంక్షేమానికి మంత్రి శ్రీధర్ బాబు కట్టుబడి ఉన్నారన్నారు. మాజీ ఉపసర్పంచ్ నరేశ్‌యాదవ్, గ్రామశాఖ అధ్యక్షుడు బావు రాయమల్లు, నాయకులు ఆరెల్లి శ్రీనివాస్, దేవునూరి రాజేశ్, దాడి మల్లయ్య, కన్నూరి మల్లేశ్, బావు సది పాల్గొన్నారు.

ఎన్ఎస్ఎస్ శ్రమదానం



శ్రమదానం చేస్తున్న గాయత్రీ విద్యార్థులు

పెద్దపల్లిరూరల్: మండలంలోని మారేడుగొండలో మంగళవారం గాయత్రీ డిగ్రీ, పీజీ కాలేజీ ఎన్ఎస్ఎస్ వలంటీర్లు శ్రమదానం చేశారు. గ్రామంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో పరిసరాలను శుభ్రం చేశారు. అక్షరాస్యతపై అవగాహన కల్పించారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి సమద్, అధ్యాపకులు సదానందం, ఆమని ఉన్నారు.

సీఐకి సన్మానం

సుల్తానాబాద్: సుల్తానాబాద్ సీఐ సుబ్బారెడ్డి, ఎస్సై శ్రావణ్ కుమార్‌ను మున్సిపల్ చైర్‌పర్సన్ గాజుల లక్ష్మి సన్మానించారు. ఇటీవల బాధ్యతలు చేపట్టిన ఇరువురిని కౌన్సిలర్లు మంగళవారం కలిసి సన్మానించారు. కౌన్సిలర్లు గుర్రాల శ్రీనివాస్, దున్నపోతుల రాజయ్య, కూకట్ల గోపి, ఉట్ల వర ప్రదీప్, సీనియర్ కాంగ్రెస్ నాయకులు బిరుదు కృష్ణ, చింతల రాజు, సంపత్, రఫీక్ పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాల కూల్చివేత

- దుకాణదారులు వారంరోజుల్లో స్థలాలను ఖాళీ చేయాలి
- మున్సిపల్ కమిషనర్ శ్రీకాంత్



కూల్చివేతను పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్ శ్రీకాంత్

జ్యోతినగర్: రామగుండం నగరపాలక సంస్థ పరిధిలోని మేడిపల్లి సెంటర్ రాజీవ్ రహదారి సర్వీసు రోడ్డును ఆనుకుని ఉన్న గ్రీన్ బెల్ట్‌గా గుర్తించిన స్థలంలో నిర్మించిన అక్రమ నిర్మాణాల కూల్చివేతను ప్రారంభించారు. కార్పొరేషన్‌లోని రాజీవ్ రహదారి మేడిపల్లి సెంటర్ నుంచి ముబారక్‌నగర్ వరకు గుర్తించిన అక్రమ నిర్మాణాలను మంగళవారం అసిస్టెంట్ సిటీ ప్లానర్ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో కూల్చివేయడం ప్రారంభించారు. మున్సిపల్ కమిషనర్ సీహెచ్.శ్రీకాంత్, రామగుండం తహసీల్దార్ కుమారస్వామి పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ రహదారిని ఆనుకున్న గ్రీన్‌బెల్ట్ ప్రాంతంలో అక్రమ నిర్మాణాలను దుకాణదారులు స్వతహాగా తొలగించి స్థలాలను ఖాళీ చేయాలని ఆదేశించారు. స్థలాలను ఖాళీ చేయని క్రమంలో మున్సిపల్‌శాఖ టౌన్‌ప్లానింగ్ అధికారుల సమక్షంలో కూల్చివేత ఉంటుందని తెలిపారు. ప్రభుత్వ స్థలంలో ఏర్పాటు చేసుకున్న అక్రమ నిర్మాణాలను కూల్చివేస్తామన్నారు. కూల్చివేత క్రమంలో పలువురు దుకాణదారులు దుకాణాలు ఖాళీ చేయడానికి సమయం కావాలని కమిషనర్‌ను కోరారు. కాగా సోమవారంలోపు అక్రమ నిర్మాణాలను తొలగించాలని, లేనిచో మున్సిపల్ సిబ్బంది తొలగిస్తారని తెలిపారు.

మాకు న్యాయం చేయండి..

కొన్నేళ్లుగా రోడ్డు పక్కన ఉన్న స్థలంలో వ్యాపారం చేసుకుని జీవనం కొనసాగిస్తున్నామని, అక్రమ నిర్మాణాల పేరుతో కూల్చివేయడం సరికాదని చిరు వ్యాపారాలు ఆవేదన వ్యక్తం చేశారు. పేద కుటుంబాలకు చెందిన వారమని, ప్రత్యామ్నాయంగా చిరు వ్యాపారాలు నిర్వహించుకునేందుకు స్థలాన్ని కేటాయించాలని కమిషనర్‌ను కోరారు.

ఎమ్మెల్యే కృషితోనే బల్దియాకు నిధులు



మాట్లాడుతున్న మేయర్ అనిల్ కుమార్, కార్పొరేటర్లు

కోల్‌సిటీ: రామగుండం నగరపాలక సంస్థకు ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ కృషితోనే టీయూఎఫ్ఐడీసీ నిధులు విడుదలయ్యాయని నగర మేయర్ బంగి అనిల్‌కుమార్ స్పష్టం చేశారు. మంగళవారం నగరపాలక సంస్థలోని మేయర్ ఛాంబర్‌లో పలువురు కార్పొరేటర్లతో కలిసి మేయర్ విలేకరుల సమావేశం నిర్వహించారు. 36వ డివిజన్ కార్పొరేటర్ బొంతల రాజేశ్, 8వ డివిజన్ కార్పొరేటర్ ధాతు శ్రీనివాస్, 28వ డివిజన్ కార్పొరేటర్ పులేందర్ సమావేశంలో మాట్లాడారు. బీఆర్ఎస్ పాలనలో మంజూరు చేసిన నిధులను, తాము తెచ్చినట్లుగా కాంగ్రెస్ నాయకులు చెప్పుకుంటున్నారని మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్ ఆరోపించడం అర్థరహితమన్నారు. అభివృద్ధి నిధుల విషయంలో బహిరంగ చర్చకు కూడా తాము సిద్ధమని తెలిపారు. ఎమ్మెల్యేగా గెలుపొందిన వెంటనే రాజ్‌ఠాకూర్, సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి టీయూఎఫ్ఐడీసీ నిధులు రూ.100 కోట్లు మంజూరు చేయించారని వెల్లడించారు. బీఆర్ఎస్ హయాంలో మున్సిపల్ చట్టాన్ని మార్చి మేయర్‌కు, కార్పొరేటర్లకు, స్థానిక ప్రభుత్వ ప్రజాప్రతినిధులకు అధికారం లేకుండా చేశారని ఆరోపించారు. ప్రజా సంక్షేమం పట్టించుకోకపోవడంతో కోరుకంటి చందర్ హయాంలో రామగుండం వెనుకబడిందన్నారు. 15వ డివిజన్ కార్పొరేటర్ శంకర్ నాయక్, 13వ డివిజన్ కార్పొరేటర్ శంకర్ పాల్గొన్నారు.

పంటలు ఎండకుండా సాగునీరందిస్తాం



శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే విజయరమణారావు

ఎలిగేడు: పంటలు ఎండిపోకుండా నీరందించేందుకు కృషి చేస్తానని పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు అన్నారు. మండలంలోని ఎలిగేడు ఆర్‌అండ్‌బీ రోడ్డు నుంచి శివపల్లి గ్రామ పంచాయతీ వరకు నూతన బీటీరోడ్డు నిర్మాణానికి డీఎంఎఫ్‌టీ నిధులు రూ.2 కోట్లు, శివపల్లిలో అంతర్గత సీసీరోడ్ల నిర్మాణానికి ఉపాధిహామీ నిధులు రూ.15లక్షలు, డీఎంఎఫ్‌టీ నిధులు రూ.2కోట్లతో నర్సాపూర్‌లో నర్సాపూర్ నుంచి ర్యాకల్‌దేవుపల్లి వరకు బీటీ రోడ్డు నిర్మాణానికి ఎమ్మెల్యే మంగళవారం శంకుస్థాపన చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎన్నికల్లో గ్రామాల్లోని ప్రజలకు ఇచ్చిన హామీల మేరకు బీటీ, సీసీరోడ్ల నిర్మాణానికి కృషి చేస్తున్నట్లు పేర్కొన్నారు. వర్షాకాలం వచ్చేలోగా పనులు పూర్తి చేస్తామన్నారు. ఎలిగేడు మండల కేంద్రంలో పోలీసుస్టేషన్ ఏర్పాటుకు సంబంధించిన ప్రక్రియ మొదలైందని తెలిపారు. జెడ్పీ వైస్‌చైర్‌పర్సన్ మండిగ రేణుక, సింగిల్‌విండో చైర్మన్ విజయభాస్కర్ రెడ్డి, ఎంపీటీసీ కొత్తిరెడ్డి ప్రేమలత, ఎంపీడీవో భాస్కర్‌రావు, ఎంపీవో అనిల్‌రెడ్డి, గ్రామప్రత్యేక అధికారి యశశ్రీ, యూత్ కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి దుగ్యాల సంతోష్‌రావు, పార్టీ మండల అధ్యక్షుడు సామ రాజేశ్వర్‌రెడ్డి, నాయకులు కొండ తిరుపతిగౌడ్, బాసంపల్లి కొండయ్య, సుధాకర్‌రెడ్డి, వెంకటేశ్‌గౌడ్, వెంకటేశ్వర్‌రావు, భూర్ల వెంకటసత్యం, బాలుసాని పర్శరాములుగౌడ్, దేవరాజ్, అమ్ముల శ్రీనివాస్, వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

సీసీరోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన

జూలపల్లి: మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల్లో రూ.75లక్షల ఎన్ఆర్ఈజీఎస్ నిధులతో నిర్మించనున్న మంగళవారం సీసీరోడ్ల నిర్మాణానికి ఎమ్మెల్యే విజయరమణారావు శంకుస్థాపన చేశారు. సిమెంట్ రోడ్ల నిర్మాణానికి గ్రామాలకు వెళ్లిన ఎమ్మెల్యేకు ఎస్సారెస్పీ సాగునీటి విడుదలపై రైతుల నుంచి వినతులు వెల్లువెత్తాయి. కోనరావుపేటలో రైతులు తమకు కాలువ నీళ్లు ఇప్పించకపోతే పంటలు కాపాడుకోలేమని, అధికారులతో మాట్లాడి చెరువులు, కుంటలు నింపేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. నీరు విడుదల చేయించి తీరుతామని ఎమ్మెల్యే రైతులకు హామీ ఇచ్చారు. ఎంపీపీ రమాదేవి, జెడ్పీటీసీ బొద్దుల లక్ష్మన్, తహసీల్దారు బషీరుద్దీన్, ధూళికట్ట సింగిల్‌విండో చైర్మన్ వేణుగోపాలరావు, సర్పంచుల ఫోరం మాజీ మండల అధ్యక్షుడు నర్సింహయాదవ్, పీఆర్ డీఈ శంకరయ్య, ఏఈ రాజ్‌కుమార్, ఈజీఎస్ఏపీవో సదానందం, ఎంపీవో కిరణ్, గొట్టిముక్కుల రవీందర్‌రెడ్డి, లోక జలపతిరెడ్డి, బొజ్జ శ్రీనివాస్, జ్యోతిబసు, తొంటి బుచ్చయ్య, కార్యదర్శులు పాల్గొన్నారు.

శారీరక శ్రమతో మానసికోల్లాసం



జిమ్‌ను ప్రారంభిస్తున్న జీఎం చింతల శ్రీనివాస్

గోదావరిఖని: నిత్యం శారీరక శ్రమతో మానసికోల్లాసం లభిస్తుందని ఆర్జీ–1 జీఎం చింతల శ్రీనివాస్ అన్నారు. మంగళవారం స్థానిక సీఈఆర్ క్లబ్‌లో సింగరేణి ఉద్యోగుల కోసం ఏర్పాటు చేసిన జిమ్‌ను ఆయన ప్రారంభించారు. కార్మికుల సంక్షేమం, వైద్య, ఆరోగ్యం కోసం రూ.7లక్షల వ్యయంతో జిమ్ ఏర్పాటు చేశామని తెలిపారు. ఎస్వోటూ జీఎం రామ్మోహన్, పర్సనల్ ఏజీఎం లక్ష్మీనారాయణ, ఏఐటీయూసీ బ్రాంచ్ సెక్రటరీ ఆరెల్లి పోషం, కార్పొరేటర్లు పెద్దెల్లి తేజస్విని‌ప్రకాశ్, అడ్డాల స్వరూపరామస్వామి, సివిల్ ఏజీఎం నాగేశ్వర్‌రావు సీనియర్ పీవో సారంగపాణి పాల్గొన్నారు.

ఆర్‌జీ నూతన కమిటీ ఎన్నిక



నూతన కమిటీ సభ్యులు

యైటింక్లయిన్‌కాలనీ: ఆర్జీ–2 ఏరియా యైటింక్లయిన్‌కాలనీలోని ఏఐటీయూసీ కార్యాలయంలో మంగళవారం ఓసీపీ–3 ఆర్‌బీ ప్రాజెక్ట్ నూతన కమిటీని ఎన్నుకున్నారు. ప్రాజెక్ట్ అసిస్టెంట్ సెక్రటరీగా ఈశ్వర్‌రెడ్డి, ఆర్‌బీ సెక్రటరీగా ధనుంజయ్, ఆర్గనైజింగ్ సెక్రటరీలు శ్రీనివాస్, లక్ష్మయ్య, ఇంచార్జిలు అనిల్‌కుమార్, రాజిరెడ్డితో పాటు కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. అనంతరం ఆర్జీ–2 హెచ్ఎంఎస్ సంఘం అసిస్టెంట్ పిట్ సెక్రటరీ జంగిలి లక్ష్మయ్య, ఏఐటీయూసీ యూనియన్‌లోకి చేరగా యూనియన్ కేంద్ర ఉపాధ్యక్షుడు పకాశ్ యూనియన్‌లోకి ఆహ్వానించారు. ఏఐటీయూసీ నాయకులు ఆర్జీ–2 బ్రాంచ్ కార్యదర్శి రవీందర్, రాజారత్నం, అన్నారావు, శాంసన్, రాజయ్య పాల్గొన్నారు.

హైటెన్షన్ టవర్ లైన్స్ తొలగింపు పనులు ప్రారంభం

సాక్షి ఎఫెక్ట్



పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ కౌశిక లత, ఎన్‌పీడీసీఎల్ ఏఈ దామోదర్‌రావు

రామగుండం: కార్పొరేషన్ 22వ డివిజన్ రామగుండం పట్టణ పరిధిలోని అయోధ్యనగర్ కాలనీ ప్రధాన రహదారి మధ్యలో నిరుపయోగంగా ఉన్న హైటెన్షన్ స్తంభాలు, విద్యుత్ తీగల తొలగింపు పనులను ఎన్‌పీడీసీఎల్ ఏఈ బేతి దామోదర్‌రావు చేపట్టారు. 11న సాక్షి దినపత్రికలో 'హైటెన్షన్ టవర్స్ తొలగించండి సారూ..' శీర్షికతో ప్రచురితమైన కథనంపై స్థానిక కార్పొరేటర్ కౌశిక లత స్పందించారు. ఎన్‌పీడీసీఎల్ ఉన్నతాధికారులను సంప్రదించి సత్వరమే రోడ్డుకు అడ్డుగా ఉన్న హైటెన్షన్ టవర్ లైన్‌ను తొలగించాలని కోరారు. స్థానిక ఏఈకి ఆదేశాలు ఇవ్వడంతో హైటెన్షన్ విద్యుత్ స్తంభాలను గ్యాస్ కట్టర్‌తో కట్ చేయడంతో పాటు టవర్ లైన్‌కు వేలాడుతూ నిరుపయోగంగా ఉన్న విద్యుత్ తీగలను తొలగించారు. విద్యుత్ స్తంభాల తొలగింపుపై స్పందించిన కార్పొరేటర్‌ను కాలనీవాసులు అభినందించారు. కార్మిక సంఘం ప్రతినిధి కౌశిక హరి, కుక్క గంగాప్రసాద్, ట్రాన్స్‌కో అధికారులు మామిడి శంకరయ్య, కాలనీవాసులున్నారు.

వేసవిలో తాగునీటి సమస్య రాకుండా చూస్తాం



పనులను పరిశీలిస్తున్న చైర్‌పర్సన్ గాజుల లక్ష్మి

సుల్తానాబాద్: వేసవికాలంలో ప్రజలకు తాగునీటి సమస్య ఉత్పన్నం కాకుండా చర్యలు చేపడుతున్నట్లు మున్సిపల్ చైర్‌పర్సన్ గాజుల లక్ష్మి అన్నారు. మంగళవారం మున్సిపల్ పరిధిలో ఉన్న పలు ప్రాంతాల్లో మంచినీటి పైపులైన్ లీకేజీ అవుతున్నాయని ప్రజలు సమాచారం ఇవ్వడంతో వెంటనే సిబ్బందితో మరమ్మతు చేయించారు. ఎలాంటి సమస్యలు ఉన్నా.. గ్రామ ప్రజలు నేరుగా వచ్చి కార్యాలయంలో గానీ నివాసంలో గానీ చెప్పొచ్చన్నారు. కౌన్సిలర్ రాజయ్య, కాంగ్రెస్ నాయకులు శ్రీనివాసరావు, గాజుల రాజమల్లు పాల్గొన్నారు.

డ్రైనేజీ నీరు రోడ్డుపైకి వదలొద్దు..

పలువురు ప్రజలు మున్సిపల్ పరిధిలో ఉన్న కాలనీల్లో డ్రైనేజీ నీటిని రోడ్డుపైకి వదులుతున్నారని వదలొద్దని మున్సిపల్ కమిషనర్ వేణుమాధవ్ సూచించారు. మంగళవారం పట్టణంలోని పలు కాలనీల్లో సందర్శించారు. పలు గ్రామాలు మున్సిపల్‌లో కలిసినందున డ్రైనేజీలు లేవని, త్వరలో కాలనీల్లో డ్రైనేజీలు నిర్మిస్తామని తెలిపారు.

పేదల కోసం పోరాడిన మహనీయుడు బుర్ర కొండయ్య



నివాళి అర్పిస్తున్న ఎమ్మెల్సీ భానుప్రసాదరావు

ఎలిగేడు: బడుగు, బలహీనవర్గాల కోసం పోరాడిన మహనీయుడు బుర్ర కొండయ్యగౌడ్ అని ఎమ్మెల్సీ భానుప్రసాదరావు అన్నారు. సీపీఐ నాయకుడు, ఉద్యమనేత, గౌడజన హక్కుల పోరాట సమితి వ్యవస్థాపకుడు బుర్ర కొండయ్యగౌడ్ ఇటీవల అనారోగ్యంతో ఎలిగేడులో అనారోగ్యంతో మృతి చెందారు. మండల కేంద్రంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. కొండయ్యగౌడ్ కుటుంబాన్ని మంగళవారం ఎమ్మెల్సీ పరామర్శించారు. అలాగే ఎమ్మెల్యే విజయరమణారావు కూడా పరామర్శించారు. సింగిల్‌విండో చైర్మన్ విజయభాస్కర్‌రెడ్డి, కేడీసీసీబీ మాజీ డైరెక్టర్ కొక్కిరాల మహేశ్వర్‌రావు, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు బైరెడ్డి రాంరెడ్డి, నాయకులు వొద్ది ప్రసాదరావు, చక్రధర్‌రావు, మోహన్‌రావు, మండిగ రాయనర్సయ్య, దుర్గయ్య, మాడ కొండాల్‌రెడ్డి, శరత్‌రెడ్డి, మహేందర్, విజయేందర్‌రెడ్డి, ఎండీ.ఖలీల్, దూడం వీరేశం, ఇరుగురాల తిరుపతి, సబ్బు శ్రీధర్, ముంజం రాకేశ్, తిరుపతిరెడ్డి, మారం కొమురయ్య పాల్గొన్నారు.

పలు గ్రామాల్లో అభివృద్ధి పనులు ప్రారంభం



పనులను ప్రారంభిస్తున్న ఎంపీపీ విజయ

రామగుండం: అంతర్గాం మండల పరిధిలోని 15 గ్రామ పంచాయతీల్లో డీఎంఎఫ్‌టీ, ఎంఎస్ఆర్ఈజీఎస్ నిధులతో చేపట్టే అభివృద్ధి పనులను మంగళవారం మండల కేంద్రంలోనే ఒకేచోట ఎంపీపీ దుర్గం విజయ, ఎంపీడీవో ఎంఏ అలీం చేతుల మీదుగా ప్రారంభించారు. డీఎంఎఫ్‌టీ నిధులతో గోలివాడలో రూ.45లక్షలు, బ్రాహ్మణపల్లి రూ.35లక్షలు, కుందనపల్లి రూ.10లక్షలు, లింగాపూర్ రూ.10లక్షలు, ముర్మూర్ రూ.35లక్షలు, పెద్దంపేట రూ.10లక్షలు, పొట్యాల రూ.10లక్షలు, సోమనపల్లి రూ.25లక్షలు, ఎల్లంపల్లి రూ.10లక్షలు, ఆకెనపల్లి రూ.10లక్షలు, రాయదండి రూ.10లక్షలతో అభివృద్ధి పనులు చేపట్టనున్నారు. ఈజీఎస్ నిధులు టీటీఎస్ అంతర్గాం రూ.7.50లక్షలు, గోలివాడ రూ.10లక్షలు, బ్రాహ్మణపల్లి రూ.15లక్షలు, ముర్మూర్ రూ.5లక్షలు, పొట్యాల రూ.5లక్షలు, ఎల్లంపల్లి రూ.16లక్షలు, ఆకెనపల్లి రూ.65లక్షలు, విసంపేట రూ.50లక్షలు, మద్దిర్యాల రూ.15లక్షలు, అంతర్గాం రూ.50లక్షలతో చేపట్టనున్న అభివృద్ధి పనులను ప్రారంభించారు. కాంగ్రెస్ మండల ఇన్‌చార్జి పెండ్రు హన్మాన్‌రెడ్డి, ప్రతినిధులు గాదె సుధాకర్, పెండ్యాల మహేశ్, ఉరిమెట్ల రాజలింగం, గుంట బాపు, బర్పటి శ్రీనివాస్ పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

క్రీడా వార్షిక వేడుకలు ప్రారంభం

రామగిరి: ఆర్జీ–3, ఏపీఏ ఏరియా వర్క్ పీపుల్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 2023–24 సంవత్సరానికి సంబంధించిన క్రీడా వార్షిక వేడుకలు బుధవారం స్థానిక రాణిరుద్రమదేవి క్రీడా ప్రాంగణంలోని సీఈఆర్ క్లబ్‌లో నిర్వహించనున్నట్లు అధికార ప్రతినిధి ముప్పిడి రవీందర్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. క్రీడాకారులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

మట్టి, ఇసుక, మొరం అక్రమ తరలింపు

పెద్దపల్లిరూరల్: మండలంలోని పెద్దబొంకూర్ గ్రామశివారులోని హుస్సేనిమియా వాగు నుంచి ఇసుక, మొరం, కలప చెరువు నుంచి నల్లరేగడి మట్టిని అక్రమంగా తరలిస్తున్నారంటూ ఎంపీటీసీ మిట్టపల్లి వసంత, నాయకుడు వెంకటేశం అధికారులకు ఫిర్యాదు చేశారు. చెరువు మట్టిని ఇటుకబట్టీలకు ఇసుక, మొరం జేసీబీల సాయంతో ప్లాట్లకు తరలిస్తూ సొమ్ము చేసుకుంటూ సహజ వనరులను బొందలగడ్డగా మారుస్తున్నారని ఆ ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ విషయమై అడిషనల్ కలెక్టర్, పంచాయతీ అధికారులకు ఫిర్యాదు చేశామన్నారు. ఈ వ్యవహారంపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరారు.

సంఘం డబ్బుల దుర్వినియోగంపై విచారణ

సుల్తానాబాద్‌రూరల్: మండలంలోని రెబ్బల్‌దేవ్‌పల్లిలోని మహిళా స్వశక్తి సంఘాలకు సంబంధించిన డబ్బుల దుర్వినియోగంపై మంగళవారం ఆయా సంఘాల మహిళలు సీఏను నిలదీశారు. తాము తీసుకున్న రుణాలకు సంబంధించిన డబ్బులు నెలనెలా సీఏకు ఇచ్చేవాళ్లమని, ఆ డబ్బులు బ్యాంక్‌లో జమ చేయలేదని ఆరోపించారు. దీంతో కొత్తగా రుణాలను బ్యాంక్ అధికారులు ఎందుకు మంజూరు చేయడం లేదని అడిగారు. ఇంకా కట్టేది ఉన్నదని తెలపడంతో సీఏను నిలదీసినట్లు తెలిపారు. విషయం తెలుసుకున్న ఐకేపీ సీసీ విచారణ చేపట్టారు. దీనిపై ఏకేపీ ఏపీఎంను వివరణ కోరగా పూర్తి వివరాలు సేకరిస్తున్నట్లు పేర్కొన్నారు.

హెచ్ఎం, సీనియర్ టీచర్లకు జాయింట్ చెక్ పవర్

సుల్తానాబాద్: రాష్ట్ర ప్రభుత్వం విద్యా కమిటీల ఎన్నికలు లేకపోవడంతో జాయింట్ చెక్ పవర్‌ను హెచ్‌ఎంతోపాటు సీనియర్ ఉపాధ్యాయులకు ఇస్తూ ప్రిన్సిపల్ సెక్రటరీ బి.వెంకటేశం ఉత్తర్వులు జారీ చేశారు. ఈనెల 11న ఉత్తర్వులు విద్యాశాఖ కార్యాలయాలకు పంపినట్లు ఉపాధ్యాయులు తెలిపారు. పాఠశాలలకు మంజూరైన నిధులు గతంలో పాఠశాల యజమాన్యం కమిటీ చైర్మన్ హెచ్‌ఎం ఇద్దరు సంతకాలతో కూడిన చెక్కును పాఠశాలకు ఉపయోగించుకునే అవకాశం ఉండేది. ఎస్ఎంసీ కమిటీలు జనవరిలో రద్దు కావడంతో రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికలు నిర్వహించలేదు. దీంతో పాఠశాలల్లో ఉన్న నిధులు సద్వినియోగం చేసుకునేలా హెచ్‌ఎంతో పాటు సీనియర్ ఉపాధ్యాయుడు సంతకంతో కూడిన చెక్కు ఉంటే పాఠశాలలో నిధులు పాఠశాల అభివృద్ధి కోసం వాడుకోవచ్చని ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నట్లు ఉపాధ్యాయులు పేర్కొన్నారు.

మోడల్ స్కూల్ ఉపాధ్యాయుల నిరసన

ధర్మారం: తెలంగాణ మోడల్ స్కూల్ ఉపాధ్యాయులు తమ వేతనాలు 010 పద్దు కింద చెల్లించాలని డిమాండ్ చేస్తూ మంగళవారం మధ్యాహ్నం భోజన సమయంలో నిరసన వ్యక్తం చేశారు. ఇప్పటి వరకు ఫిబ్రవరి వేతనాలు అందకపోవటంపై ఇబ్బంది పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు.

డైరీ ఆవిష్కరణ

రామగుండం: ఎలక్ట్రిసిటీ ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన సంవత్సర డైరీ, క్యాలెండర్‌ను మంగళవారం బీ–థర్మల్ సూపరింటెండెంట్ ఇంజనీర్ పి.విజేందర్ ఆవిష్కరించారు. ఇంజనీర్లు ఈ.రాములు, రాజ్‌కుమార్, ఆముల కరణ్‌కుమార్, కె.శేఖర్, భూమయ్య, పురుషోత్తం, రమేశ్, అన్వేష్, నాగరాజు ఉన్నారు.

బాధ్యతలు స్వీకరణ

జ్యోతినగర్: జాతీయ ఎస్సీ కమిషన్ సభ్యుడిగా వడ్డెపల్లి రాంచెందర్ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. న్యూఢిల్లీలోని లోక్ నాయక్ భవన్‌లో రాష్ట్రపతి ద్రౌపతి ముర్ము ఉత్తర్వుల ద్వారా భారత రాజ్యాంగ స్వయం ప్రతిపత్తి కలిగిన జాతీయ ఎస్సీ కమిషన్ సభ్యుడిగా బాధ్యతలు స్వీకరించారు.

మహిళలపై దాడులను ప్రతిఘటిద్దాం

జ్యోతినగర్: మహిళలపై దాడులను ప్రతిఘటిద్దామని పీవోడబ్ల్యూ రాష్ట్ర నాయకురాలు కోడిపుంజుల లక్ష్మి అన్నారు. మంగళవారం ఎన్డీపీసీ రామగుండం ఆటోనగర్‌లోని పార్టీ కార్యాలయంలో అంతర్జాతీయ శ్రామిక మహిళా దినోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. స్వరూప, సంధ్య, స్వరూప, జయ పాల్గొన్నారు.

నూతన యూనియన్ ఏర్పాటు

పాలకుర్తి: బసంత్‌నగర్ కేశోరాం సిమెంట్ కర్మాగారంలో ఓబీ పనులు నిర్వహించే కాంట్రాక్ట్ సంస్థ జనసీలో విధులు నిర్వహించే డ్రైవర్లు, హెల్పర్లు, మెకానిక్‌లు మంగళవారం తమ డిమాండ్ల పరిష్కారం కోసం నూతన యూనియన్‌ను ఏర్పాటు చేసుకున్నారు. యూనియన్ గౌరవ అధ్యక్షుడిగా రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్, కేశోరాం గుర్తింపు కార్మికసంఘం అధ్యక్షుడు బయ్యపు మనోహర్‌రెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ముక్కెర శ్రీనివాస్, అధ్యక్షుడిగా దాడి మహేశ్, ప్రధాన కార్యదర్శిగా తోట మహేశ్, ప్రధాన సలహాదారులుగా పర్శవేని శ్రీనివాస్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ నూతన కార్యవర్గానికి కార్మికులు వినతిపత్రం అందజేశారు.

మల్లికార్జునస్వామి జోగు ఎత్తిన యాదవులు

జూలపల్లి: మండల కేంద్రంలోని శ్రీకృష్ణ యాదవ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శ్రీరావుల మల్లికార్జునస్వామి పట్నాలు, బోనాల కార్యక్రమంలో మంగళవారం స్వామికి జోగు ఎత్తారు. సభ్యులు కొమ్మ ఐలయ్య, మల్లెత్తుల కనుకయ్య, కొమురయ్య, వెంకటరమణ ఉన్నారు.

ఆధునిక సాంకేతిక విధానంపై అవగాహన

సుల్తానాబాద్‌రూరల్: ఆధునిక సాంకేతిక విధానంపై రైతులకు అవగాహన ఉండాలని మండల వ్యవసాయ అధికారి డేవిడ్‌రాజు అన్నారు. సుల్తానాబాద్ మండలం కాట్నపల్లిలోని రైతువేదికలో మంగళవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రైతులకు ఆధునిక సాంకేతిక విధానాలపై శాస్త్రవేత్తలతో చర్చాగోష్ఠి నిర్వహించి యాజమాన్య పద్ధతులపై అవగాహన కల్పించారు.

మహిళా సమానత్వం ఇంటి నుంచే ప్రారంభం కావాలి

రామగిరి: మహిళా సమానత్వం ఇంటి నుంచే ప్రారంభం కావాలని ఐఎన్‌టీయూసీ ఆర్జీ–3 డివిజన్ వైస్ ప్రెసిడెంట్ కోట రవీందర్‌రెడ్డి అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆర్జీ–3, ఏపీఏ ఏరియాల్లో వివిధ డిపార్ట్‌మెంట్లలో పనిచేస్తున్న మహిళలను ఐఎన్‌టీయూసీ ఆధ్వర్యంలో సన్మానించారు. సివిల్ సూపర్‌వైజర్ బెల్లం శ్రీనివాస్, శ్రావణ్, రవి, ఉద్యోగులు మల్లిక, ఉష, జ్యోతి, రజనీ, సరిత పాల్గొన్నారు.

రైతులకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలి

రామగుండం: కేంద్ర ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని అఖిల భారత రైతు కూలీ సంఘం జిల్లా అధ్యక్షుడు మేర్గు చంద్రయ్య అన్నారు. మంగళవారం అంతర్గాం మండల కేంద్రంలోని సంఘం కార్యాలయంలో మాట్లాడారు. హామీలు నెరవేర్చాలని డిమాండ్ చేస్తూ ఈనెల 14న ఉమ్మడి రామగుండం మండల కేంద్రంలో నిర్వహించే ధర్నాకు హాజరు కావాలని కోరారు. నాయకులు కొల్లూరి మల్లేశ్, ఆలిండియా కార్మిక మజ్దూర్ సంఘ్ జిల్లా నాయకులు పాల్గొన్నారు.

ఎస్‌బీఐ ఎలక్టోరల్ వివరాలు బహిర్గతం చేయాలి

గోదావరిఖనిటౌన్: సుప్రీంకోర్టు న్యాయస్థానం ఎలక్టోరల్(ఎన్నికల) బాండ్ల వివరాలను తెలియజేయాలని ఎస్‌బీఐ బ్యాంకుకు ఆదేశాలు జారీ చేసినప్పటికీ బహిర్గతం చేయడంలేదని నిరసిస్తూ సీపీఎం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక మున్సిపల్ కార్పొరేషన్‌లోని ఎస్‌బీఐ బ్యాంకు ఎదుట నిరసన తెలిపారు.

సీతారామచంద్రస్వామి ఆలయంలో కల్యాణం



ధర్మారం: మండల కేంద్రంలోని సీతారామచంద్రస్వామి ఆలయంలో నిర్వహిస్తున్న బ్రహ్మోత్సవాలలో భాగంగా మంగళవారం కల్యాణోత్సవం ఘనంగా నిర్వహించారు. ఉదయం సుప్రభాతసేవ, ఆరాధనతో ప్రారంభమై మధ్యాహ్నం 12 గంటలకు కల్యాణం నిర్వహించారు. సాయంత్రం విష్ణు సహస్రనామ స్తోత్ర పారాయణం, నిత్య హోమం, సామూహిక తులసి అర్చన, చివరగా ఊరేగింపు కార్యక్రమం జరిగింది. ఉదయం నుంచి సాయంత్రం వరకు వివిధ రకాల పూజా కార్యక్రమాల్లో సందడిగా మారింది. ఆలయ కమిటీ చైర్మన్ జెడ్పీటీసీ పుస్కూరి పద్మజ భక్తులకు సౌకర్యం కలకుండా ఏర్పాట్లు చేశారు.